నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
మంగళవారం
10 డిసెంబర్
2024
పేజీలు 8
గుంటూరు పల్నాడు



### జిల్లాలో 100 శాతం
## చెత్త విభజన జరగాలి

**:జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు**

**నరసరావు పేట, మేజర్ న్యూస్**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో వంద శాతం చెత్త విభజన జరగాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, కెమికల్ వ్యర్థాలు, నిర్మాణ రంగ వ్యర్థాలు వంటి అన్ని రకాల చెత్తను ఎక్కడికక్కడ విభజించి సేకరించాలన్నారు. స్థానిక కలెక్టరేట్ లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు జిల్లా పర్యావరణ ప్రణాళిక సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో పల్నాడు జిల్లా పర్యావరణ ప్రణాళికకు ఆమోదం తెలిపారు. ప్రణాళికలో భాగంగా 2025 మే 31 నాటికి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఇంటి వద్దే చెత్త సేకరణ జరగాలన్నారు. 2025 అక్టోబరు 31 నాటికి అన్ని మున్సిపాలిటీల్లో నాన్ రీసైక్లబుల్ వేస్ట్ నిర్వహణ కోసం శానిటరీ లాండ్ ఫిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో నిర్మాణ రంగ వ్యర్థాలు, ఈ వ్యర్థాల సేకరణ, నిర్వహణ కోసం డిపాజిటరీ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ నదీ జలాల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. శాఖల వారీగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతీయ శాఖ ఈఈ నజీనా బేగం మొహమ్మద్, జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్, డీఎంహెచ్ఓ రవి, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## వసివాడుతున్న బాల్యం





- బడికి దూరమవుతున్న బాల్యం
- కొరవడుతున్న పురోగతి
- చేష్టలుడిగిన కార్మిక శాఖ
- బాల కార్మికుల లెక్కలు తేల్చడం లో విఫలం
- నిర్వీర్యం గా మారిన బాల కార్మిక చట్టాలు

**ఉమ్మడి గుంటూరు జిల్లా లో బాల కార్మికుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పొట్ట గడవటం కష్టమైన అనేకమంది తల్లిదండ్రులు పిల్లల్ని చదువులు మానేయించి కార్మికులుగా మార్చేస్తున్నారు. పలక, బలపం పట్టి ఉత్సాహంగా ఆటపాటతో చదువుకోవాల్సిన చిన్నారులు పలుగు పారా ఎత్తి, తాపీ పట్టి, బొచ్చెలు మోస్తూ, రాళ్లు కొడుతూ దుర్భరమైన జీవనం కొనసాగిస్తున్నారు. సగటు మనిషి జీవనం ముందుకు సాగటం కష్టమైన తరుణంలో కోట కూడు గడవక పిల్లల చేత వెట్టి చాకిరీ చేయించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. బాల కార్మికులను గుర్తించి వారిని చదువు వైపు దృష్టి మరల్చటానికి ఆ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బాల కార్మికుల హక్కులు, వారికోసం రూపొందించిన చట్టాలను అధికారులే నిర్వీర్యం చేస్తున్నారనటంలో ఎలాంటి సందేహం లేదు. వెట్టి చాకిరి చేయించుకుంటున్న యజమానులపై చర్యలు తీసుకోవడానికి కార్మిక శాఖ అధికారులు భయపడిపోతున్నారు..**

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

బాలకార్మికులు ఈ మధ్యకాలంలో విపరీతంగా పోతున్నారు. వారి కోసం రూపొందించిన చట్టాలు చతికిల పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా శ్రామిక శక్తిలో వేలమంది మంది బాలలు ఉన్నారు. ప్రతి 11 మంది పిల్లల్లో ఒకరు వెట్టి చాకిరీ చేస్తూ మగ్గిపోతున్నారు. దీంతో బాలకార్మిక వ్యవస్థకు అంతం లేకుండా పోయింది. బాలకార్మికుల సంఖ్యపై ప్రభుత్వం వద్ద ఎలాంటి గణాంకాలూ అందుబాటులో లేవని తెలుస్తోంది. సుమారు మూడు దశాబ్దాలుగా ఈ సమస్యను పర్యవేక్షిస్తున్న జాతీయ బాలకార్మిక ప్రాజెక్టు (ఎన్‌సీఎల్‌పీ)కి సరైన

మిగతా 3వ పేజీలో

## జగన్ రోడ్డెక్కితే అడుగడుగునా నిలదీతలు ఖాయం

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ. ఆంజనేయులు వెల్లడి
- నూజెండ్లలో చీఫ్ విప్ జీవీ ప్రజాదర్బార్

**నూజెండ్ల మేజర్ న్యూస్:** చేసినవన్నీ చేసి ఇప్పుడు పోరుబాట అంటూ బూటకపు యాత్రలతో రోడ్లపైకి వస్తే జగన్‌ను అడుగడుగునా ప్రజలు నిలదీయడం ఖాయమన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. స్థానిక సంస్థల నిధుల మళ్లింపు నుంచి విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిల వరకు వేలకోట్లు మింగేసిన పాపానికే జగన్ ప్రభుత్వం మాకొద్దని ప్రజలు ఛీకొట్టిన సంగతి అప్పుడే మరిచిపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా తప్పులు సరిదిద్దుకుని, ఆత్మవిమర్శ చేసుకోవాలని చురకలు వేశారు. శాసనసభ చీఫ్ విప్‌గా జీవీ ఆంజనేయులు బాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అర్జీలు వెలువెత్తాయి. నూజండ్ల మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు మండల వ్యాప్తంగా వివిధ సమస్యలపై 139 అర్జీలు వచ్చాయి. బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని భరోసా కల్పించారు. అర్జీలను నిర్ణీత





గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భంగానే మంత్రి లోకేష్ ప్రజాదర్బార్ ఎమ్మెల్యేలందరికీ ఆదర్శమన్నారు జీవీ. ఆయన బాటలోనే ప్రతి సోమవారం ఒక మండల కేంద్రంలో ప్రజాదర్బార్ పెట్టి స్థానిక సమస్యలు తీర్చేలా ముందుకెళ్తున్నామన్నారు. జగన్ పాలనలో విచ్చలవిడిగా పెరిగిన గంజాయి, గుట్కాల సంస్కృ తినీ అరికడుతున్నామన్నారు. వైకాపా అయిదేళ్ల పాలనలో రీసర్వే అక్రమాలు, ఊరురా భూకబ్జాలు తప్ప ఏం చేశారో బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. కూటమి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన భూ కబ్జాల నియంత్రణ చట్టం ద్వారా ఇకపై ఎవరైనా భూఆక్రమణకు ప్రయత్నిస్తే నేరుగా జైళ్లకు పంపిస్తామని హెచ్చరించారు జీవీ. ఇప్పుడు జగన్ పోరుబాట అవసరమేంటో కూడా చెప్పాలని నిలదీశారు. ఐదేళ్లలో 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై 30వేల కోట్లకు పైగా భారం వేసిన వ్యక్తి ఏ మోహం పెట్టుకుని పోరుబాట అంటున్నారని మండిపడ్డారు. గుంతలు పూడుస్తున్నందు కా? రెవెన్యూ సదస్సులు పెట్టి రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తున్నందుకా? ఎందుకు పోరు బాటనో చెప్పాలన్నారు. జగన్ జనం ముందుకు వస్తే రీసర్వే పేరుతో ప్రజలను బెదిరించి ఖరీదైన భూములను 22ఏ చట్టంలోకి మార్చుకున్నందుకు నిలదీయడానికి అంతా సిద్ధంగా ఉన్నారన్నా రు. గతంలో అమ్మఒడి పేరిట ఎగనామం పెట్టారని, బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయించినందుకు పోరుబాట చేస్తారా? అని ప్రశ్నించారు. లక్షలాది మందికి అమ్మఒడి ఎగ్గొట్టారని, తొలి ఏడాది వచ్చిన వారికి రెండో ఏడాది రాలేదని, దానికి సమాధానం చెప్పాలన్నారు. చదువుకునే ప్రతి బిడ్డకు తల్లికి వందనం అందించబోతున్నామని, అందుకుగాను బడ్జెట్‌లో రూ.6,487 కోట్లు కేటాయించామన్నారు. విద్యార్థులకు ఫీజు

మిగతా 3వ పేజీలో

# ఈ ధైర్యం ఎవరిది ?

## పవన్ కళ్యాణ్‌ను బెదిరించిన వ్యవహారం

**గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



ఇంతకీ ఎందుకు పవన్ విషయంలో ఈ బెదిరింపు కాల్స్ వచ్చాయి, ఎవరు చేసి ఉంటారు అన్నది హాట్ హాట్ డిస్కషన్ గా ఉంది. ఏపీ ఉప ముఖ్యమంత్రి తెలుగు నాట అపారమైన జనాదర్ణ కలిగి ఉన్న టాప్ స్టార్, జాతీయ రాజకీయాల్లో నవ సంచలనంగా నమోదు చేసుకున్న పవన్ కళ్యాణ్ ని చంపేస్తాం అంటూ బెదిరింపు కాల్స్ రావడం పట్ల సర్వత్రా టెన్షన్ నెలకొంది. ఈ వార్త ఒక్కసారిగా వైరల్ అయింది. ఇంతకీ ఎందుకు పవన్ విషయంలో ఈ బెదిరింపు కాల్స్ వచ్చాయి, ఎవరు చేసి ఉంటారు అన్నది హాట్ హాట్ డిస్కషన్ గా ఉన్నది. ఇక పవన్ ని చంపేస్తామని ఒక ఆగంతకుడు ఏకంగా డిప్యూటీ సీఎం ఆఫీసుకు మేసేజ్ పంపించినట్లుగా అధికారులు తెలిపారు. దీని మీద వెంటనే డిప్యూటీ సీఎం పేషీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దీని మీద సమగ్రమైన దర్యాప్తుని చేపట్టారు. ఇదిలా ఉంటే ఉప ముఖ్యమంత్రి పవన్ ని ఉద్దేశించి ఆగంతకుడు అసభ్యకరమైన భాషలో హెచ్చరిస్తూ మేసేజ్ లను పంపించారు అని అంటున్నారు. పవన్ ని చంపేస్తామని డిప్యూటీ సీఎం పేషీకే ఫోన్ కాల్స్ రావడంతో అంతా అప్రమత్తం అయ్యారు. ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి అధికారులు తీసుకుని వెళ్లారు. ఇదిలా ఉంటే పవన్ ఒక వైపు రాజకీయాల్లో బిజీగా ఉంటూనే సినిమాలు చేస్తున్నారు. ఇక ఆయన అనేక అంశాలలో తన అభిప్రాయాలను కుండబద్ధలు కొట్టినట్లుగా మాట్లాడుతున్నారు. ఆయన దేశంలో ఏ రాజకీయ నాయకుడూ చేయని విధంగా చాలా డేరింగ్ గా కీలక అంశాల గురించి ప్రస్తావిస్తున్నారు. బంగ్లాదేశ్ లో హిందువుల మీద జరుగుతున్న దాడుల విషయం అయినా, దేశంలో సనాతన ధర్మం ఉండాలన్న దాని పైన అయినా పవన్ కచ్చితంగానే మాట్లాడుతున్నారు. ఇక ఆయన దేశంలో అందరూ బాగుండాలని కోరుకుంటూ ఇస్తున్న సందేశాలు కూడా చర్చకు దారి తీస్తున్నాయి. అవినీతి అక్రమాల విషయంలోనూ ఆయన ఉక్కు పాదంతో వ్యవహరిస్తున్నారు. ఇటీవలే పవన్ కాకినాడ షిప్ లో అక్రమంగా బియ్యం రవాణా అవుతోంది అన్న వార్తల నేపథ్యంలో తుఫానుతో ఒక పక్క అలజడిగా సముద్రం ఉన్నా బోటు వేసుకుని మరీ నడి సముద్రంలోకి వెళ్ళి షిప్ ని పరిశీలించారు. సీజ్ ద షిప్ అని అక్కడే ఆయన ఆదేశాలు ఇచ్చారు.

ఇక కాకినాడ పోర్టు వ్యవహారం మీద అక్రమ రవాణా మీద ఆయన మీడియా సమావేశంలో కూడా చాలా అంశాలు చెప్పారు. తనను ఇక్కడకు రావద్దని అనేకమైన ఒత్తిళ్ళు పెడుతున్నారని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఇలా ఆయన తనదైన పద్ధతిలో గత ఆరు నెలలుగా చేస్తున్న పాలన కానీ ఆయన విధానాల విషయంలో ముక్కు సూటితనం కానీ ఇవన్నీ చర్చకు వస్తున్న విషయాలే. ఇదిలా ఉంటే పవన్ ప్రాణాలకు ముప్పు ఉందని భావిస్తూ నిఘా వర్గాలు కూడా ఇటీవల అలెర్ట్ చేశాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆగంతకుడు ఏకంగా పవన్ పేషీకే ఫోన్ చేసి బెదిరించడం అంటే ఎక్కడికి ఈ ధైర్యం అన్న ప్రశ్నలు వస్తున్నాయి. పవన్ కళ్యాణ్ అంటే కోట్లాది మందికి ఆరాధన ఉంది. ఆయన వెండి తెర నాయకుడిగా కాకుండా జనాదరణ విశేషంగా ఉన్న ప్రజా నాయకుడిగా ఉన్నారు. ఆయన రాజకీయాల వల్ల ఇబ్బంది పడే వర్గాలు ఉండొచ్చు కానీ ఈ విధంగా బెదిరింపులు చేయడమేంటి అన్న చర్చ ఉంది. ఏదైనా ఉంటే ప్రజాస్వామ్య యుతంగా తేల్చుకోవాల్సిందే అన్న మాట ఉంది. ఇవన్నీ పక్కన పెడితే కేంద్రంలోని బీజేపీకి అత్యంత సన్నిహితమైన మిత్రపక్షంగా ఉన్న పవన్ కి బెదిరింపు కాల్స్ వస్తున్నాయంటే కేంద్రం కూడా ఈ విషయంలో గట్టి చర్యలకు ఉపక్రమిస్తుందని అంటున్నారు.

## మార్చి 15 నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

టెన్త్ పబ్లిక్ పరీక్షలను మార్చి 15వ తేదీ నుంచి నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మార్చి నెలాఖరుకల్లా పరీక్షలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు పాఠశాల విద్యా శాఖ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేసింది. టైమ్ టేబుల్‌తో కూడిన ప్రణాళికను పాఠశాల విద్యాశాఖ ఉన్నత పాఠశాలలకు పంపించింది. దీని ప్రకారం ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆరు సెషన్లలో పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు డిసెంబర్ ఒకటో తేదీ నుంచి మార్చి 10వ తేదీ వరకు యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని విద్యాశాఖ ఆయా పాఠశాలలను ఆదేశించింది.

# ఆక్స్ ఫర్డ్ స్కూల్ లో 26వ యాన్యువల్ స్పోర్ట్స్ డే నిర్వహణ






**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరులో నిర్వహించిన గుంటూరు ఆక్స్ ఫర్డ్ స్కూల్ వారి 26వ యాన్యువల్ స్పోర్ట్స్ డే కార్యక్రమం ఎన్టీఆర్ స్టేడియం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ పాల్గొన్నారు. తొలుత విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం మన్నవ మోహన కృష్ణ

**కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మన్నవ మోహన కృష్ణ**

గారు మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు , విద్యాశాఖ మంత్రివర్యులు నారా లోకేష్ ప్రోత్సాహంతో రాష్ట్రంలో క్రీడలను బలోపేతం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ముందుకొస్తోందన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణతో కూడిన స్పోర్ట్స్ లో ప్రతి ఒక్కరూ రాణించాలని అన్నారు. ప్రపంచ వేదికపై దేశం గర్వించేలా ఛాంపియన్ ఆటగాళ్లగా మన యువత ఎదగాలని కోరారు. ఈ సందర్భంగా ఆక్స్ ఫర్డ్ స్కూల్ వారి 26వ యాన్యువల్ స్పోర్ట్స్ డే లో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఏషియన్ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ నాగం జ్ఞానదివ్య పాల్గొన్నారు.

# జగన్.. నీ కంటే మహానటులు ఎవరూ లేరు: రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



**గుంటూరు, మేజర్ న్యూస్ :** వైకాపా అధినేత జగన్ కంటే మహానటులు ఎవరు లేరని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. పదే పదే అబద్ధాలు చెప్పడంతోపాటు ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి ప్రజా రక్షకుడిగా చెప్పడం ఆయనకే సాధ్యమైందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు హత్యలు, దాడులు, అక్రమ కేసులతో అరాచకపాలన సాగించి.. ఇప్పుడేమో మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. విద్యా వ్యవస్థను దారిలో పెట్టి రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న శ్రమను నటన అంటున్నారని మండిపడ్డారు. వైకాపా హయాంలో విద్యార్థులు, ఉపాధ్యాయులపై మోయలేని భారాన్ని పెట్టి విద్యా వ్యవస్థను నాశనం చేశారని ధ్వజమెత్తారు. జగన్ పాలనలో పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం ఘోరంగా పడిపోయిందని దుయ్యబట్టారు. గాడితప్పిన విద్యా వ్యవస్థను యువ నేత, మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కష్టపడి దారిలో పెడుతుంటే చూసి సహించలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా నటించడం ఆపి ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని హితవు పలికారు.

# మా భూమిలో అక్రమంగా జగనన్న కాలనీ కట్టేశారు





**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

- జనవాణిలో బద్వేలుకు చెందిన బాధితుడి ఆవేదన
- జనవాణికి ఫిర్యాదుల వెల్లువ
- ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రభుత్వ విప్, ఆరవ శ్రీధర్

భూ సేకరణ చేయలేదు.. పరిహారం ఇవ్వలేదు.. మా భూమిలో అక్రమంగా జగనన్న కాలనీ కట్టేశారు.. భూ యజమానికి అందాల్సిన పరిహారంతో వైసీపీ నేతలు జేబులు నింపుకున్నారు. కోర్టు చెప్పినా అధికారులు వినడం లేదు. న్యాయం కోసం కోర్టు మెట్లెక్కనందుకు చంపేస్తామన్న బెదిరింపులు తప్ప ఏమీ మిగలలేదు... మంగళగిరి కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో కడప జిల్లా, బద్వేలు నియోజకవర్గం, కొండలవీడు గ్రామానికి చెందిన బి. సుబ్బారెడ్డి అనే బాధితుడు ఫిర్యాదు చేశారు. తమ భూమిలో ఇళ్లు కట్టి రోడ్లు సైతం వేసేశారని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరులు మొక్కజొన్న పంట కొని రెండేళ్లుగా డబ్బు ఇవ్వకుండా తిప్పుకుంటున్నరని త్రిపురాంతకం ప్రాంతానికి చెందిన రైతులు ఫిర్యాదు చేశారు. సోమవారం ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు శాసన సభ్యులు ఆరవ శ్రీధర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించగా, రాష్ట్రం నలుమూలల నుంచి తమ సమస్యలు చెప్పుకొనేందుకు బాధితులు పదుల సంఖ్యలో తరలి వచ్చారు. ప్రతి ఫిర్యాదుని నిశితంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్రిపురాంతకం మండలానికి చెందిన 34 మంది రైతులు తాము పండించిన స్వీట్ కార్న్ రకం మొక్కజొన్న పంటను మాజీ ఎంపీ నందిగం సురేష్ సమీప బంధువు, ఆయన అనుచరులు అయిన జున్ను జగదీష్ కి అమ్మామని, రూ. 23 లక్షల విలువైన పంట కొనుగోలు చేసి డబ్బు అడిగితే ముఖం చాటేశారని జనవాణిలో ఫిర్యాదు చేశారు. మొదట అదిగో ఇదిగో అని దాటవేత ధోరణిలో మాట్లాడారని, నిలదీస్తే నందిగం సురేష్ అనుచరులమని బెదిరిస్తున్నారని వాపోయారు. రాజధాని ప్రాంతానికి చెందిన జున్ను జగదీష్ నుంచి తమకు రావాల్సిన మొత్తం ఇప్పించాలని వేడుకున్నారు. ఆరవ శ్రీధర్ స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడి కేసు నమోదు చేయాలని, బాధితులకు న్యాయం చేయాలని దిశా నిర్దేశం చేశారు. 'మా తాతల నాటి భూమిపై వైసీపీ నేతల కన్ను పడింది. 70 ఏళ్లుగా మా కుటుంబ ఆధీనంలో ఉన్న భూమి మాది కాదు అని అధికారులతో చెప్పిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని మా భూమి ఆన్ లైన్ కాకుండా చేశారు. 1954లో మా పూర్వీకులకు ఇచ్చిన పట్టా ఆధారం ఉన్నా మా భూమిపై మాకు హక్కులు కల్పించేందుకు అధికారులు ససేమిరా అంటున్నారు. మా తండ్రి గారి నుంచి సంక్రమించిన భూమిపై మాకు హక్కులు కల్పించేలా చేయాల'ని అన్నమయ్య జిల్లా, ముదివేడు గ్రామానికి చెందిన రొయ్యల రమేష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. 'గన్నవరం నియోజకవర్గం, బాపులపాడు గ్రామంలో ఉన్న 489 ఎకరాల భూమి పొరపాటుగా నిషేధిత 22ఏ జాబితాలో కలిసింది. నాటి జిల్లా కలెక్టర్ సాయంతో రికార్డుల పరిశీలన చేసిన పిదప అవి పట్టా భూములేనని తేలింది. మొత్తం భూమి ఆన్ లైన్ చేసి పాసు పుస్తకాలు ఇచ్చారు. అందులో 25 ఎకరాల భూమికి పాసు పుస్తకాలు రాలేదు. మా భూ సమస్య పరిష్కరించండి' అంటూ దుర్గాభవాని అనే మహిళ ఫిర్యాదు చేశారు. అదే విధంగా వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వ కార్యాలయల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై వివిధ వర్గాల ప్రజలు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సిహెచ్. సుందరరామిరెడ్డి, నందిగామ నియోజకవర్గ పీఓసీ తంబళ్లపల్లి రమాదేవి, న్యాయ విభాగానికి చెంది న బయ్యారపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు

- ఆమోదం తెలిపిన కేంద్రం
- మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గం కేటాయింపు




**పల్నాడు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు రానున్నాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మాచర్ల నియోజకవర్గంలో తాళ్లపల్లి, నరసరావుపేట నియోజకవర్గంలో రొంపిచర్లలో నిర్మించనున్నారు. మూడేళ్ల క్రితం కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. అప్పట్లోనే కేంద్ర ఉన్నతాధికారులు వచ్చి స్థలం పరిశీలించారు. స్థలంలో మట్టిపోసి చదును చేయాలని సూచించి వెళ్లిపోయారు. మరో అడుగుపడలేదు. కేంద్ర క్యాబినెట్‌లో ఏపీకి ఎనిమిది కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేస్తున్నట్లు ఆమోదం తెలపడంతో అందులో రెండు మన జిల్లాలో ఉండడం విశేషం. మాచర్లలో తాళ్లపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు, రొంపిచర్లలో కేంద్రీయ విద్యాలయానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు 2019-24 మధ్య ఎంపీగా ఉన్న సమయంలో కృషి చేశారు. తాళ్లపల్లిలో 12 ఎకరాలను రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. మట్టి పరీక్షలు చేశారు. భూమి పూజా కూడా చేయాలనుకున్నారు. తర్వాత ఎన్నికలు రావడంతో ప్రక్రియ ఆగిపోయింది. రొంపిచర్లలో 5ఎకరాలు కేటాయించారు. ఇక్కడ కూడా మట్టి పరీక్షలు పూర్తి చేశారు. జిల్లాలో ఇప్పటివరకూ సత్తెనపల్లి, చిలకలూరిపేటల్లో మాత్రమే కేంద్రీయ విద్యాలయాలున్నాయి. మాచర్ల వంటి వెనుకబడిన ప్రాంతానికి కేంద్రీయ విద్యాలయం మంజూరుకావడంతో విద్య పరంగా బాగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఈ రెండుచోట్ల ప్రవేశాలు జరగనున్నాయి. భవనాల నిర్మాణం పూర్తయ్యేలోపు అద్దె భవనాల్లో కేంద్రీయ విద్యాలయాలను కొనసాగించనున్నారు.

# బుధ, గురు వారాల్లో తాగునీటికి అంతరాయం

**గుంటూరు, మేజర్ న్యూస్ :** బుధ, గురువారాల్లో (11,12 తేదీలు), నగరంలో త్రాగునీటి సరఫరాలో అంతరాయం...నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం తెలిపారు తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ కు త్రాగునీటి సరఫరా జరిగే 1600 ఎంఎం డయా పైప్ లైన్ పై తక్కెళ్లపాడు గ్రామంలో ఏర్పడిన లీకును బుధ వారం సరఫరా అనంతరం మరమత్తు చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. మరమత్తు పనుల వలన తక్కెళ్లపాడు ఫిల్టరేషన్ పాయింట్ పూర్తిగా నిలుపుదల చేయాల్సి ఉంటుందని, బుధవారం ఉదయం సరఫరా అనంతరం ప్లాంట్ ని నిలిపి పనులు చేపడతారని తెలిపారు. దీని వలన నగరంలో పలు ప్రాంతాల్లో బుధవారంసాయంత్రం నుండి గురువారం సాయంత్రం వరకు త్రాగునీటి సరఫరా నిలిపివేయబడునని, శుక్రవారం ఉదయం నుండి యధావిధిగా సరఫరా జరుగుతుందాని తెలిపారు నగర ప్రజలు నీటి సరఫరా అంతరాయం గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో అయన తెలిపారు .

# వసివాడుతున్న బాల్యం

(మొదటి పేజీ తరువాయి)

నిధుల కేటాయింపులు లేకపోవడమే అందుకు కారణం. 2016లో సమగ్ర శిక్షా అభియాన్‌లో ఎన్‌సీఎల్‌పీని విలీనం చేసినప్పటి నుంచి బాలకార్మికులకు సంబంధించిన రికార్డులు లేవని, వాటికోసం తరవాతి జనగణన దాకా వేచి చూడాల్సిందేనని గత ఏడాది పార్లమెంటులో పార్లమెంటరీ స్థాయీ సంఘానికి కార్మిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. దీన్నిబట్టి బాల కార్మికుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అవగతమవుతోంది. ప్రతి రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం, వార్డు, వీధుల్లో పర్యటించి బాల కార్మికుల లెక్కలు తేల్చాల్సిన అధికార గణం ఇంకా నిద్రావస్థలోనే ఉండిపోయింది. బాలకార్మికుల గణాంకాల కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘం 14 మంత్రిత్వ శాఖలను సంప్రదించినా సరైన సమాచారం లభించలేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో తెలుసుకోవచ్చు.. బాలకార్మికుల కోసం ఎన్‌సీఎల్‌పీ నెలకొల్పిన పాఠశాలలు సైతం మూడు, నాలుగేళ్లు పనిచేసి నిధుల కొరతతో మూతపడ్డాయి.

**చట్టాలున్నా ఫలితమేదీ?**

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్లో అయిదు నుంచి 14 ఏళ్ల మధ్య వయసులో వేలమంది బాలలు పనుల్లో కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. . అదే వయసు వారిలో అనేకమంది చదువు సంధ్య లేక బడి బయట ఉన్నారు. బాలకార్మిక శ్రామిక శక్తిలో 14-17 ఏళ్ల మధ్య వయసు వారు దాదాపు 48 శాతం ఉన్నారని ఇటీవల సేవ్ ది చిల్డ్రన్ సంస్థ లెక్కగట్టింది. వారిలో బాలికల కంటే బాలురే ఎక్కువగా ప్రమాదకర పనుల్లో కొనసాగుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 80శాతం పిల్లలు ఏదో ఒక పనిలో నిమగ్నమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాలు, పెద్ద పట్టణాల్లో పనులు ఎక్కువగా లభిస్తున్నందువల్ల చిన్నారుల వలసలు కొనసాగుతున్నాయి. యునిసెఫ్ నివేదిక ప్రకారం- పట్టణీకరణ ప్రాంతాల్లో అయిదు నుంచి 14 ఏళ్ల వయసులోని బాలకార్మికుల్లో 50 శాతం పెరుగుదల కనిపించింది. అయితే దక్షిణాది రాష్ట్రాలతో పోల్చుకుంటే ఉత్తరాదిలో బాలకార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంది. అధిక జనాభా, నిరక్షరాస్యత, పేదరికం వంటి కారణాలతో బడి ఈడు పిల్లలు చదువుకు దూరమవుతున్నారు. కుటుంబ ఆదాయాన్ని పెంచుకోవడానికి తల్లిదండ్రులు వారిని పనులకు పంపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కుటుంబాల అప్పులు సైతం చిన్నారులను బాలకార్మికులుగా మార్చేస్తున్నాయి. ఏదైనా పనిలో పిల్లలను నియమించడం 2016లో సవరించిన బాల, కౌమారదశ కార్మిక (నిషేధం- నియంత్రణ) చట్టం-1986 ప్రకారం గుర్తించదగిన క్రిమినల్ నేరం. కర్మాగారాల చట్టం-1948 ప్రకారం గనులు, పేలుడు, మండే పదార్థాల తయారీ సంస్థల్లో, ప్రమాదకర వృత్తుల జాబితాలో చేర్చిన పనుల్లో కౌమారదశలో ఉన్నవారిని నియమించకూడదు. ప్రమాదకర పరిశ్రమల్లో బాలకార్మికులను చేర్చుకోవడాన్ని రాజ్యాంగంలోని 24వ అధికరణ సైతం వ్యతిరేకించింది. దేశవ్యాప్తంగా బాలకార్మికుల్లో 55 శాతం వ్యవసాయ రంగంలో ఉన్నట్లు ఐఎల్‌ఓ వెల్లడించింది. 63 శాతం బాలకార్మికులు వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఉన్నారని ఐక్యరాజ్య సమితి ఆహార, వ్యవసాయ సంస్థ తెలిపింది. వ్యవసాయేతర ప్రధాన రంగాలన్నింటా బాలకార్మికులు కనిపిస్తారు. 2014 డిసెంబరులో అమెరికా కార్మిక శాఖ బాలకార్మికుల ద్వారా ఉత్పత్తయిన వస్తువుల జాబితాను విడుదల చేసింది. వాటిలో 23 రకాలు భారత్‌లో రూపొందుతున్నట్లు వెల్లడించింది.

**సమష్టి కృషి అవసరం**

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం కఠినమైన చట్టాలను తీసుకురావాలి. ఉచిత ప్రాథమిక విద్యను అందించడం ద్వారా బడి వయసు బాలలెవరూ విద్యకు, విజ్ఞానార్జనకు దూరం కాకుండా చర్యలు తీసుకోవడం తప్పనిసరి. అనాథలకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు జీవనోపాధి కోసం వారు బాల్యంలోనే పనులు చేయకుండా వారికి చేయూత అందించాలి. బాలకార్మిక వ్యవస్థ కొనసాగడంలో సమాజమే కీలకంగా నిలుస్తోంది. పిల్లల జీవితాలను, సామాజిక పరిస్థితులను బాల కార్మిక వ్యవస్థ ఎలా ప్రభావితం చేస్తుందో తెలియకపోవడం వల్లనే అది ఇంకా ఉనికిని చాటుకొంటోంది. తక్కువ వేతనంతో ఎక్కువ సమయం పనిచేయించుకోవచ్చనే ఉద్దేశంతో యజమానులు పిల్లలను పనుల్లో నియమించుకుంటున్నారు. బాలకార్మికుల నిషేధ చట్టాల గురించి యజమానులకు తెలియజెప్పాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. ప్రభుత్వ విధులకు ప్రజల మద్దతు తోడైతే బాలకార్మిక వ్యవస్థను రూపుమాపడం పెద్ద కష్టం కాదు. బాలలే రేపటి దేశ భవిష్యత్తు అనే వాస్తవాన్ని సమాజానికి వివరించి దేశ సౌభాగ్యానికి పిల్లల చదువు, వారి సరైన ఎదుగుదల అత్యంత కీలకమని అర్థమయ్యేలా చేయాలి.

**కొరవడుతున్న పురోగతి**

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఉన్న అవకాశాలను గుర్తించేందుకు 1979లో గురుపాదస్వామి కమిటీని కేంద్రం నియమించింది. ఆ కమిటీ సిఫార్సుల ఆధారంగా 1986లో బాలకార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం తెచ్చారు. ప్రమాదకర వృత్తుల్లో పనిచేస్తున్నవారి పునరావాసంపై దృష్టి సారించేందుకు 1987లో జాతీయ విధానాన్ని రూపొందించారు. 1988 నుంచి కార్మిక, ఉపాధి కల్పనా మంత్రిత్వ శాఖ బాలకార్మికుల పునరావాసానికి పెద్ద సంఖ్యలో పథకాలను అమలు చేసింది. పలు స్వచ్ఛంద సంస్థలు బాలల విద్య, ఇతర వసతుల కల్పనకు కృషిచేసినా ఫలితం దక్కలేదు. బాలకార్మికుల సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నా పేదరికం, నిరక్షరాస్యత వంటి కారణాల వల్ల పురోగతి కొరవడుతోంది.

**బడికి దూరం**

పేదరికం, ప్రభుత్వ అరకొర విద్యా సదుపాయాలు బాలకార్మిక వ్యవస్థ కొనసాగడానికి కారణాలని బీబీసీ నివేదిక నిర్ధారించింది. బాలురతో పోలిస్తే రెట్టింపు సంఖ్యలో బాలికలు చదువుకు దూరమై, ఇంటి పనుల్లో నిమగ్నమవుతున్నారని యునిసెఫ్ గుర్తించింది. పాఠశాల అందుబాటులో ఉన్నా విద్యావ్యయం భరించలేకపోవడం, బడుల్లో ఎదురయ్యే వేధింపులు, లింగ దుర్విచక్షణ వంటి కారణాలతో ఎక్కువ మంది బాలికలు చదువును మధ్యలోనే వదిలేస్తున్నారు. పిల్లల సంపాదన కుటుంబ మనుగడకు కీలకమని తల్లిదండ్రులు భావించడమూ పిల్లలు బడికి దూరంకావడానికి ఒక కారణం. కొన్ని కుటుంబాల మొత్తం ఆదాయంలో 25 నుంచి 40శాతందాకా పిల్లల ద్వారానే సమకూరుతున్నట్లు అంచనా.

# ప్రజా సమస్యల పరిష్కరిస్తాం కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు, మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమిషనర్, పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను సమగ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 22 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్ కి అందిన ఆర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. ఆర్జీల పరిష్కార పురోగతిపై కమిషనర్ చాంబర్ కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకొని అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న ఆర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలని, ఆయా ఆర్జీలను ర్యాండమ్ గా క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జిఎంసి కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలన్నారు. ప్రజల నుండి అందే అర్జీలు, ఫిర్యాదుల నమోదుకి ప్రతి విభాగంలో ప్రత్యేకంగా రిజిస్టర్ ఏర్పాటు చేయాలన్నారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కు 47 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 20, ఇంజినీరింగ్ విభాగం 15, రెవెన్యూ విభాగం 4, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ విభాగంకి సంబంధించి 3 ఫిర్యాదులు అందాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ సిహెచ్. ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, సిటి ప్లానర్ రాంబాబు, మేనేజర్ బాలాజీ బాష, డిసిపిలు, ఏసిపిలు, ఈఈలు, ఆర్ఓలు, ఎస్ఎస్ లు పాల్గొన్నారు.

## జగన్ రోడ్డెక్కితే అడుగడుగునా నిలదీతలు ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

బకాయిలు ఎందుకు పెట్టారో సమాధానం చెప్పాలని, జగన్‌రెడ్డి నిర్వాకం వల్ల ధ్రువపత్రాలు రాక ఎంతోమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జగన్‌రెడ్డిని నిలదీయడానికి వారంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్లు ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో సమస్యలు సృష్టించేందుకు, అలజడులు, గొడవలు పెట్టేందుకే పోరుబాట అని, కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాష్ట్రాన్ని ఏం చేద్దామని అనుకుంటున్నారని ధ్వజమెత్తారు. జల్‌జీవన్ మిషన్ కింద కేంద్రం నిధులు ఇస్తే ఆ పనులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. గత తెదేపా హయాంలో అర్బన్ హౌసింగ్ పథకం కింద నిధులు ఇచ్చి ఇళ్లు మంజూరు చేశామని, వాటిని ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. లక్షలాది ఇళ్లు ఎందుకు రద్దు చేశారో సమాధానం చెప్పాలన్నారు.

## నేడు విద్యుత్ నిలిపివేత....

**యడ్లపాడు, మేజర్ న్యూస్:** యడ్లపాడు సెక్షన్ పరిధిలోని స్పైసస్ పార్క్ సబ్ స్టేషన్ లో వంకాయలపాడు ఫీడర్ మరమ్మత్తుల కారణంగా వంకాయలపాడు గ్రామము మరియు కొండవీడు సబ్ స్టేషన్ లో కొండవీడు ఫీడర్ మరమ్మత్తుల కారణంగా కొండవీడు, కోట, సొలస, లింగారావుపాలెం, చేంగిజ్ ఖాన్ పేట గ్రామములలో గృహ వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయమునకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని కావున విద్యుత్ వినియోగదారులు సహకరించగలరు అని విద్యుత్ శాఖా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్. అశోక్ కుమార్ ఒక ప్రకటన లో కోరారు.

## ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి




**గుంటూరు మేజర్ న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్ లో ఉపాధ్యాయులు ఉద్యోగులు సంఘాలు సంఘాలు స్థాపించుకునే హక్కును సాధించి పెట్టిన మహనీయుడు చెన్నుపాటి లక్ష్మయ్య అని రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు అన్నారు. సోమవారం బ్రాడీపేట లోని యుటిఎఫ్ కార్యాలయంలో చెన్నుపాటి వర్ధంతి కార్యక్రమం జరిగింది. సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమం కోసం చెన్నుపాటి తన జీవితాన్ని త్యాగం చేసారని అన్నారు. సంఘాన్ని స్థాపించడమే కాకుండా రాష్ట్రము మొత్తం తిరిగి ఉపాధ్యాయులను ఏకం చేస్తూ సంఘాన్ని బలోపేతంకు అహర్నిశలు కృషి చేశారని అన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ చెన్నుపాటి ఆశయాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనలో చెన్నుపాటి స్ఫూర్తితో రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు వై.నాగ మణి జిల్లా కార్యదర్శులు సి హెచ్ ఆదినారాయణ, ఎం గోవిందు, కె. రంగారావు, బెల్లంకొండ ప్రసాద్,ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి సీనియర్ కార్యకర్తలు ఆదామ్ సాహెబ్, కొండపల్లి వెంకటేశ్వరరావు, భాస్కర్,పి శ్రీనివాసరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ వర్కర్ గోలి లక్ష్మీకాంతారావు
# గుండెపోటుతో మృతి

**మంగళగిరి మేజర్ న్యూస్:**



మంగళగిరి ఇందిరానగర్లో సోషల్ వర్కర్ గోలి లక్ష్మీకాంతారావు గుండెపోటుతో శనివారం రాత్రి మరణించారు. ఆయన వయసు 74 సంవత్సరాలు, ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె కలరు. ఆదివారం సాయంత్రం ఆయన నివాస గృహం వద్ద అంత్యక్రియలు జరిగాయి. మంగళగిరిలో సుమారు రెండున్నర దశాబ్దాల నుంచి ఒంటరిగా పలు ప్రజా సమస్యలపై వినూత్నంగా పోరాటాలు చేస్తూ ప్రజలకు సుపరిచితులు.

## నిబంధన పాటించకుంటే కఠిన చట్టాలు తప్పవు
### - వెహికల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరి

గుంటూరు, మేజర్ న్యూస్

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామం వాహనాలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా వెహికల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ వాహనల యాజమాన్యలు తప్పనిసరిగా నిబంధనలు పాటిచాలి అని లేకుంటే కఠిన చర్యలు తప్పవు అని అదేవిధంగా స్కూల్స్ బస్సులో వాహనాల పరిమితికి పరిమితికి మించి విద్యార్థులు ఎక్కిచరాదని తెలిపారు..

## మంగళ, శనివారాల్లో
## సాగర్ - శ్రీశైలానికి లాంచీలు

**గుంటూరు, మేజర్ న్యూస్**

నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలానికి ఇకపై వారానికి 2 రోజులు లాంచీలు నడవనున్నాయి. ఈఏడాది నవంబరు లో లాంచీట్రిప్పులను ప్రారంభించి, వారానికి ఒక లాంచీ చొప్పున 800 మందిని శ్రీశైలం తీసుకెళ్లినట్లు పర్యాటక శాఖ తెలిపింది. ఇక నుంచి మంగళ,శనివారాల్లో లాంచీలు నడుపుతామని పేర్కొంది.

ఒకవైపు టికెట్ ధర పెద్దలకు రూ.2వేలు, పిల్లలు(12ఏళ్ల లోపు) రూ.1600, 2వైపులా రూ.3,000, రూ.2వేలుగా నిర్ణయించినట్లు స్పష్టం చేసింది.

## సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ
# అప్రమత్తంగా ఉండాలి

- సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేయకూడదు.
- సోషల్ మీడియా పై ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి
- అడిషనల్ ఎస్పీ రవికుమార్

మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరి ఆత్మకూరు నిర్మల ఫార్మసి కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు సోమవారం సాయంత్రం నిర్వహించారు. అవగాహన సదస్సు ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు జిల్లా అడిషనల్ ఎస్పీ ఏటివి రవికుమార్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు పట్ల విద్యార్థులు అధ్యాపకులు అందరూ జాగ్రత్త వహించి మోసాల బారిన పడవద్దు అని సూచించారు. ఈ నేరాలు జరుగుతున్న పద్ధతులపై విద్యార్థులకు ఆయన ఉద్భోదించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ వ్యక్తిగత సమాచారంతో సైబర్ నేరాలకు పాల్పడు తున్నారన్నారు. బ్యాంక్ ఆన్లైన్ మోసాలు సోషల్ మీడియా వచ్చే ఫోన్ కాల్స్ లింకులు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రవికుమార్ కోరారు. ట్రైన్ డిఎస్పి ఎం ఎం భార్గవి, మంగళగిరి రూరల్ సీఐ వై శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ విద్యార్థిని, విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. ఈ అవగాహన సదస్సులో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సిస్టర్ జి నిర్మల జ్యోతి ప్రిన్సిపల్ డాక్టర్ బి పాముల్ రెడ్డి, యాంటీ ర్యాగింగ్ కమిటీ కోఆర్డినేటర్ ఎస్ జ్యోతి , సాయి లక్ష్మి శాంత, కళాశాల విద్యార్థులు,అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ప్రజలకు మేలు చేకూరడంలో అధికారుల పాత్ర ఎనలేనిది
### సినీ మాటల రచయత బుర్రా సాయిమాధవ్

**తెనాలి, మేజర్ న్యూస్**




ప్రభుత్వం ద్వారా ప్రజలకు మేలు చేకూరడంలో అధికారుల పాత్ర కీలకమైనదని సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్ పేర్కొన్నారు. ట్రెజరర్ అండ్ అకౌంట్స్ డిపార్ట్మెంట్ ఏటీవో గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వల్లూరు సుబ్రహ్మణ్యం అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నందుల పేట కవిరాజ పార్క్ లో గల విజికే భవన్ లో ఉద్యోగ విరమణ చేసిన వల్లూరు సుబ్రహ్మణ్యం అభినందన సభను ఆయన అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అరసం జిల్లా నాయకులు చెరుకుమల్లి సింగారావు సభకు అధ్యక్షత వహించగా వక్తలు తమ ప్రసంగాల్లో సుబ్రహ్మణ్యం ఉద్యోగ జీవితంలో అందించిన సేవలను విశ్లేషించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ మాటల రచయిత బుర్ర సాయి మాధవ్ మాట్లాడుతూ లోటుపాట్లు ఎన్ని ఉన్నా ఉద్యోగులు సమాజానికి అందించె సేవల ద్వారా సమాజానికి చేకూరే మేలును వివరించారు. అనంతరం సాయిమమాధవ్ చేతులమీదుగా విశ్రాంత ఉద్యోగి సుబ్రహ్మణ్యం దంపతులను సత్కరించారు. సత్కార గ్రహీత వల్లూరి సుబ్రమణ్యం మాట్లాడుతూ బాల్యం నుండి తమ జీవితంలో ఎదుర్కొన్న సంఘటనలు, ఉద్యోగ జీవితంలో ఎదురైన ఆటుపోట్లు,తనవంతుగా ఉద్యోగులకు అందించిన సహకారాన్ని వివరించారు. మిత్రుల మధ్య సత్కారం అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బేతాళం కృష్ణమోహన్ , గరికపాటి సుబ్బారావు, తాడి బోయిన హరి ప్రసాద్, వేమూరి విజయభాస్కర్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు , కన్నెగంటి గోపయ్య, కన్నెగంటి మధు తదితరులు పాల్గొన్నారు.



# కంపుకొడుతున్న తెనాలి కంపోస్టు యార్డు

## పేరుకుపోతున్న చెత్త నిల్వలు
## నిర్లక్ష్యానికి గురవుతున్న యార్డ్
## తగలబడి పోతున్న పట్టించుకోని అధికారులు
## దట్టమైన పొగతో సమీప ప్రాంత ప్రజలు ఉక్కిరిబిక్కిరి

**తెనాలి, మేజర్ న్యూస్**

ఘన వ్యర్థాల నిర్వహణలో ఒకప్పుడు జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవడంతో పాటు ఎన్నో స్వచ్ఛతా అవార్డులు అందుకున్న తెనాలి పురపాలక సంఘం నేడు అధికారుల నిర్లక్ష్య ధోరణితో అధోగతికి చేరిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఏకైక స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరున్న తెనాలి పట్టణం చెత్త సేకరణ, నిర్వహణ తో పాటు ఇక్కడ అమలవుతున్న పారిశుద్ధ్య విధానాలపై జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేడు బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డులో చెత్తనిల్వలు పేరుకుపోయాయి. దీంతో డంపింగ్ యార్డులోని చెత్తలో మీథేన్ గ్యాస్ వల్ల మండే స్వభావంతో తగులబడి ఆ ప్రాంతమంతాదుర్వాసన వెదజల్లుతు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. మంటలను ఆర్పివేసేందుకు చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారని, పోతే సమీప ప్రాంత ప్రజల ప్రాణాలే గద పోయేది అన్నట్లు నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారన్నఆరోపణలు వినిపిస్తున్నాయి. తెనాలి పురపాలక సంఘంలో 40 వార్డులు ఉన్నాయి. వీటి నుండి రోజుకు సుమారు 80 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డుకు తరలిస్తారు. యార్డులో ఉన్న వర్మి కంపోస్టు, బయో గ్యాస్ నిర్వహణకు 7 టన్నుల చెత్తను వినియోగిస్తారు. మిగిలిన చెత్తను నాయుడుపేట లోని జిందాల్ ప్లాంట్ కు తరలించాల్సి ఉంది. అయితే ఇందులోనూ సంబంధిత ఇంజనీరింగ్ విభాగపు అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. చెత్త తరలింపుకు కీలకమైన పెద్ద కాంపాక్టర్ వాహనం గత కొద్ది కాలంగా మరమ్మత్తులకు గురైంది. ఇది అందుబాటులోకి వస్తే దీనిద్వారా రోజుకు సుమారు 10 టన్నుల చెత్తను తరలించవచ్చు. దీన్ని బాగు చేయించి అందుబాటులోకి తీసుకురావడంలోనూ అధికారులు శ్రద్ధ వహించడం లేదన్న వాదనలు ఉన్నాయి. చిన్న కాంపాక్టర్ వాహనాలు మూడు ఉన్నావీటి ద్వారా రోజుకు సుమారు 12 టన్నుల చెత్త మాత్రమే తరలిస్తున్నారు. వీటికి తోడు ప్రైవేటు టిప్పర్ల ద్వారా రోజుకు సుమారు 10 నుంచి 16 టన్నుల వరకు చెత్తను తొలగిస్తున్నారు. లక్ష్యం మేరకు తరలింపు జరగకపోవడంతో కంపోస్ట్ యార్డులో చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. చెత్తనిల్వలు ఎక్కువగా ఉండడం అది మండుతుండడం తో ఆ ప్రాంతంలో నిత్యం కాలుష్యం వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంత వాసులు రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కాంపాక్టర్ మరమ్మత్తులు పూర్తయ్యాయి
### - శ్రీనివాస్ ఇంచార్జ్ మున్సిపల్ ఇంజనీర్

కంపోస్ట్ యార్డులో చెత్త తరలింపు ప్రతి రోజు జరుగుతున్నది. మరమ్మత్తులకు గురైన పెద్ద కాంపాక్టర్ వాహనం కొద్ది రోజుల్లోనే అందు బాటులోకి రానుంది. దీంతో మరింత ఎక్కువ చెత్త తరలింపుకు అవకాశం ఉంటుంది.

### చెత్త నిల్వలను త్వరలోనే పూర్తి స్థాయి లో తరలిస్తాం
### - బి.శేషన్న మునిసిపల్ కమీషనర్

కంపోస్టు యార్డులో తగలబడుతున్న చెత్తను మోటర్ల ద్వారా ఆర్పే ప్రయత్నం రోజు చేపడుతున్నాము. పూర్తిస్థాయిలో చెత్తను తరలించేందుకు టెండర్లు పూర్తయ్యాయి. ఇందుకుగాను రూ. 3.17 కోట్ల వ్యయం కేటాయించడం జరిగింది. సంబంధిత ఏజెన్సీ త్వరలోనే పనులు చేపట్టనుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉంది.

# సోనియా గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

**తెనాలి, మేజర్ న్యూస్**

కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకురాలు సోనియా గాంధీ 78వ జన్మదిన వేడుకలు స్థానిక మారీస్ పేటలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం పట్టణ పార్టీ అద్యక్షులు పొన్నూరు నాగ సూర్యశశిధర్ అద్యక్షతన నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త, డాక్టర్ చందు సాంబశివుడు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాజీవ్ గాంధీ తర్వత కాంగ్రెస్ పార్టీ ఉన్నతి కోసం ఎనలేని కృషి చేస్తూ పార్టీకి గత వైభవం తీసుకువచ్చారన్నారు.

2004లో కేంద్రంలో యుపిఎ అధికారం చేపట్టక గ్రామీణ ఉపాదిహామిపథకం,సమాచారహక్కుచట్టం అమలు చేశారన్నారు. రాష్ట్ర విభజన తో నేడు అమరావతి రాజధానిగా ఏర్పడటానికి పరోక్షంగా కాంగ్రెస్ విధానమే కారణమని అన్నారు.తద్వారా ఈప్రాంత పొలాల ధరలకు రెక్కలు వచ్చి, ఆర్ధిక ప్రయోజనం చేకూరిందన్నారు. అనంతరం సోనియా చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.

అభిమానులు ఏర్పాటుచేసిన కేక్ కట్ చేసి, సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో ఒబిసి స్టేట్ ఉపాధ్యక్షుడు గుర్రపు ద్వారకా శ్రీనివాస్, మండలపార్టీ అద్యక్షులు కర్లపూడి బుల్లియ్య, పెనుగొండ శివకుమార్, భీమ రమేష్, శివన్నారాయణ, రాయప్ప, శంకర్రావు, కోటేశ్వరరావు, కృష్ణ, శ్రీను, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ జన్మదిన వేడుకలు

**సత్తెనపల్లి, మేజర్ న్యూస్:**
పట్టణంలోని 24వ వార్డు కౌన్సిలర్, వైసిపి నాయకులు అచ్యుత శివప్రసాద్ జన్మదిన వేడుకలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, పరివర్తన అనాథ శరణాలయం నందు ఆయన అభిమానులు సన్నిహితులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అనంతరం పరివర్తన అనాథ శరణాలయం నందు పిల్లలకి పండ్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అచ్యుతకు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పక్కాల సూరిబాబు, కౌన్సిలర్లు కుకుట్ల లక్ష్మి, శెట్టి ఆనంద్, అవ్వారు శ్రీనివాసరావు, తోట లక్ష్మీనారాయణ, లక్ష్మారెడ్డి, సుప్రజ స్టీల్ కోటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, కొత్త రామకృష్ణ, కరిముల్లా, శివ సాయి, రఫీ, బాబు, మల్లికార్జున రెడ్డి, నాగేశ్వరరావు (ధోని), రామారావు, ఘని, కుకుట్ల శ్రీను, కటుమన్ డేవిడ్, సెగెం వెంకటేశ్వర్లు, లోక చంద్ర, తిరుమల, సాయి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

**యడ్లపాడు, మేజర్ న్యూస్:**
రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకం గా ప్రారంభించిన రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మండల తహశీల్దార్ విజయ శ్రీ కోరారు. తాజాగా రెవెన్యూ అధికారులు మార్పు చేసిన షెడ్యూల్‌ను తహసీల్దార్ జెట్టి విజయశ్రీ సోమవారం పత్రికల వారికి విడుదల చేశారు. తాజా షెడ్యూల్ ప్రకారం.. ఈనెల 10వ తేదీన మైదవోలు, 11 వ తేదీన సొలస, 12న తిమ్మాపురం, 13న ఉన్నవ, 17న కారుచోల, 18న సందెపూడి, 19న తుర్లపాడు, 20న జాలాది, 21 యడ్లపాడు-2, 24న కొండవీడు, 27న యడ్లపాడు-1, 28న మర్రిపాలెం రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు . మైదవోలు, సందెపూడి, మర్రిపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మిగిలిన గ్రామాల్లో గ్రామ సచివాలయాల్లోనూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును వీఆర్వో లాగిన్‌ద్వారా పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేసి, రిజిస్టర్ చేసినట్లు రశీదు ఇవ్వనున్నట్లు తెలిపారు. సదరు వివరాలను నేరుగా రైతు ఫోన్‌కు సమాచారం అందిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తులు రాయడం రాని వారికోసం సదస్సుల్లో ప్రత్యేకంగా రాసే సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కావున రెవెన్యూ సదస్సుల్ని మండల ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



# ఎలుకల నిర్మూలనతో వ్యవసాయానికి మేలు

## ◆ రైతులకు అవగాహన కల్పించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్ :**
ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్. ఎస్. ఎస్ వాలంటీర్లు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా ఎలుకల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎలుకలు వలన పంటకు కలిగే నష్టాలను మరియు ఎలుకల యొక్క నివారణ చర్యలను చార్ట్ ల రూపంలో గ్రామ రైతులకు వివరించారు. బకెట్ ట్రాప్ నమూనాను వరి పొలంలో పెట్టి ఎలుకలను ఎలా నివారించవచ్చు అనే విషయాన్ని ఎన్. ఎస్.ఎస్ అధికారులైన డా. సి. సంధ్యారాణి డా. జి. విజయ్ కుమార్ ల ఆధ్వర్యంలో రైతులకు వివరించారు. ఎన్.ఎస్ఎస్ వాలంటీర్లైన సాతులూరు విద్యార్థినులు ఎరతెర పద్ధతిలో వరి పొలంలో ఎలుకలను ఎలా నివారించవచ్చు అనే విషయాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సాతులూరు, మాదల, నార్నేపాడు, చాగంటివారి పాలెం గ్రామాలలో వచ్చిన ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లైన వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు. గ్రామస్థులందరు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లను, ఎన్.ఎస్.ఎస్ అధికారులను అభినందించారు.



# తెదేపాలో చేరిన మరో వైఎస్ఆర్సిపి ఎంపీటీసీ



**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్:**
మండలం పరిధిలో లోని తొండపి గ్రామానికి చెందిన వైయస్సార్ సిపి ఎంపీటీసీ షేక్ బందెల హుస్సేన్ బి. సోమవారం తెదేపా తీర్థం పుచ్చుకుంది. నియోజకవర్గ కార్యాలయంలో శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీ లో జాయిన్ అయ్యారు. ఎంపీటీసీ సభ్యురాలికి కన్నా పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ సభ్యులు కల్లం వీర భాస్కర్ రెడ్డి స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

# కార్డ్స్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు, దుస్తులు పంపిణీ




**యడ్లపాడు, మేజర్ న్యూస్:**
మండల కేంద్రమైన యడ్ల పాడులోని సుగాలి కాలనీ బాల బాట కార్యాలయంలో సోమవారం కార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో బాల బాట కార్యకర్తలకు దుస్తులు, చీరలు, నెలవారీ నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథులుగా కార్డ్స్ స్వచ్ఛంధ సేవా సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు రిటైర్డ్ ఏఎస్పై మద్దు వెంకట రత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల బాట ద్వారా ఎస్సీ.ఎస్టీ విద్యార్థుల విద్య, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ సంస్థ యడ్ల పాడు మండల కో ఆర్డినేటర్ కొమ్ము పద్మ మాట్లాడుతూ బాల బాట ద్వారా మహిళలు స్వయం కృషితో స్వావ లంబన సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యడ్లపాడు మండల గుడ్ షెపర్డ్స్ యునైటెడ్ ఫెలోషిప్ అధ్యక్షులు ప్రత్తిపాటి ఏ లీషా, పాస్టర్లు అల్లాడి కరుణానిధి, కొమ్ము ఇమ్మానుయేల్, బోద అబ్రహం, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల జాతీయ సదస్సు

**ఏ ఎన్ యు/ పెదకాకాని, మేజర్ న్యూస్:-**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ డాక్టర్ డి .రవిశంకర్ రెడ్డి తెలిపారు. ఈనెల 11, 12 తేదీల్లో యూజీసీ ఆర్థిక సహకారంతో మల్టీ డిసిప్లినరీ రీసెర్చ్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్మెంట్ అనే అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ సదస్సుకు ఇన్చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని, అలాగే ముఖ్య ఉపన్యాసకులుగా జబల్పూర్ లోని మంగలయాటెన్ యూనివర్సిటీ వీసి ఆచార్య కేఆర్ఎస్. సాంబశివరావు, భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ డైరెక్టర్ సైంటిస్ట్ డాక్టర్ ఐ. బాలకృష్ణ లు ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆల్ అమీన్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ ఆచార్య ఎండి. సలాహుద్దీన్ తిరువనంతపురం క్యాన్సర్ సెంటర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గురువాయూరప్ప చంద్రశేఖర్, హైదరాబాదులోని నరసింహారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ గ్రూప్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ తెలంగాణ ఏపీ టీ ఐ ప్రెసిడెంట్ ఆచార్య సిహెచ్. కృష్ణమోహన్ తదితరులు పాల్గొంటారని వివరించారు.
జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ. ప్రమీల రాణి అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు.
సదస్సుకు కో కన్వీనర్ గా డాక్టరు అన్నపూర్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కే. సుజన, కోశాధికారిగా డాక్టర్ కే ఈ ప్రవల్లిక, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా డాక్టర్ కే .మస్తానమ్మ , కే. విజయ్ కిషోర్ లు వ్యవహరిస్తారని తెలిపారు.

# వినీత్ బ్రిజ్ లాల్ నేతృత్వంలోని సిట్ పరిధిని పెంచాలి

## - పౌర సంఘాల విజ్ఞప్తి




**గుంటూరు, మేజర్ న్యూస్ :**
రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరుగా ఉన్న వినీత్ బ్రిజ్ లాల్ నేతృత్వంలో నియమించిన సిట్ పరిధిని పెంచాలని జన చైతన్య వేదిక,మానవత,అవగాహన,నేస్తం,కోవిడ్ ఫైటర్స్,రేట్ పేయర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈనెల తొమ్మిదవ తేదీన గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లూరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రేషన్ బియ్యంను రాష్ట్రంలో 80 శాతం లబ్ధిదారులు వినియోగించు కోవడం లేదని, కేవలం 10 రూపాయల లోపు ధరలకే దళారీలకు అమ్ముకుంటున్నారని అన్నారు. స్థానిక అధికార పార్టీ ఎమ్మెల్యేలకు,అధికార యంత్రాంగానికి ఆదాయ వనరుగా మారిందన్నారు. ప్రతి మండలానికి ఒక్క ఏజెంట్ను నియమించు కొని వారి నుండి ప్రతి నెల లక్ష రూపాయలు దండుకుంటున్నా రన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏడాది 12800 కోట్ల రూపాయలు రేషన్ బియ్యం పై ఖర్చు చేస్తున్నాయని ఇందులో 10,000 కోట్ల రూపాయలు దళారుల చేతుల్లోకి పోతూ ప్రజాధనం వృధా అవుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్లో 1.68 కోట్ల కుటుంబాలు ఉంటే అందులో 1.48 కోట్ల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో పేదరి కం ఆధారంగా అనర్హులను గుర్తించి తొలగించడం ద్వారా లబ్ధిదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించవచ్చున న్నారు.ప్రస్తుతం మన రాష్ట్రంలో 29 వేల రేషన్ డిపోలు ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 92 లక్షల కుటుంబాలకు రేషన్ బియ్యం అందిస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం 56 లక్షల కుటుంబాలకు బియ్యం పంపిణీ చేస్తుందన్నారు.గతంలో స్వర్గీయ ఎన్టీఆర్ ప్రభుత్వం మార్కెట్లో కిలో బియ్యం రు 3.50 ఉన్నప్పుడు రెండు రూపాయలకే బియ్యం అందిస్తూ సబ్సిడీ కిలోకు 1.50 మాత్రమే ఇవ్వగా నేడు మార్కెట్లో కిలో బియ్యం 50 రూపాయలు ఉండగా నేడు ఉచితంగా బియ్యం ఇస్తూ మొత్తం 50 రూపాయలు సబ్సిడీ భరిస్తుందన్నారు. గత ప్రభుత్వం 540 కోట్లు వ్యయం చేసి 9260 వాహనాలు కొని వాటి నిర్వహణకు ప్రతి ఏటా 2,600 కోట్లు వెచ్చిస్తున్నాయన్నారు. బియ్యం వాహన నిర్వాహకుడే మొదటి దళారీగా మారి అవినీతికి అంకురార్పణ చేస్తున్నారన్నారు.లబ్ధిదారులకు నాణ్యమైన సన్న బియ్యం, మిల్లెట్స్, కోడిగుడ్లు, పాలు, రాగి పిండి,జొన్న పిండి లాంటివి అందించడం ద్వారానే అవినీతికి అడ్డుకట్ట వేయగలమన్నారు. లేదా నగదు బదిలీ పథకం ద్వారా ప్రతి కిలో బియ్యానికి 40 రూపాయలు చొప్పున నగదు బదిలీ చేయడం ద్వారా లబ్ధిదారులైన పేదలకు ఫలితం దక్కుతుందన్నారు.అవినీతి కి స్వస్తి పలకగలమన్నారు.బియ్యం పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ యంత్రాంగం అంతా పనిచేయవలసి వస్తుందన్నారు.దృఢమైన రాజకీయ సంకల్పంతో క్షేత్రస్థాయిలో అవినీతి నిర్మూలించాలన్నారు.వినీత్ బ్రిజ్ లాల్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం అవినీతి మూలాలలోకి వెళ్లాలని రేషన్ షాప్ డీలర్ నుండి మండల స్థాయి,జిల్లా స్థాయి దళారులపై చర్యలు తీసుకోవాలన్నారు.రైస్ మిల్స్ వారు రేషన్ బియ్యని రీసైక్లింగ్ కు ఉపయోగిస్తున్నారని, దోసెల కోసం,కోళ్ల ఫారం ల కోసం వినియోగిస్తున్నారని వాస్తవంగా పేదలుగా ఉన్న లబ్ధిదారులు 20 శాతం మంది మాత్రమే రేషన్ బియ్యం వినియోగిస్తున్నారని అన్నారు.ప్రతి రేషన్ షాప్ దారులు ప్రతి నెల రెవిన్యూ మాములు నెలకు వెయ్యి రూపాయలు చొప్పున చెల్లిస్తున్నారని అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రతి సంవత్సరం కనీసం 5 కోట్ల రూపాయల దాక దళారీల నుండి వసూలు చేస్తున్నారని జిల్లాస్థాయి పౌరసరఫరాల శాఖ అధికారి నుండి పోస్టింగ్లలో కనీసం 50 లక్షలు వసూలు చేస్తున్నారని తెలిపారు. బియ్యం మాఫియా యదేచ్ఛగా గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అవినీతికి పాల్పడటం బహిరంగ రహస్యమ న్నారు. పేదలకు ఆహార భద్రతను కల్పిస్తున్నామని అనే నెపంతో వేలాది కోట్ల రూపాయలు అవినీతి చేస్తున్నారని వివరించారు.ఈ మీడియా సమావేశంలో అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మానవత డైరెక్టర్ యన్.సాంబశివరావు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఒరుగంటి నారాయణరెడ్డి, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయ రెడ్డి, కోవిడ్ ఫైటర్స్ అధ్యక్షులు అల్లా బక్షు,ప్రోగ్రెసివ్ ఫోరం ఉపాధ్యక్షులు కేవీబి మురళీకృష్ణా రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# నిత్యావసర ధరల నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

## - పొన్నూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సత్యనారాయణ




**పెదకాకాని, మేజర్ న్యూస్:**
నిత్యాసర ధరలు నియంత్రించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనట్లు పుప్పాల సత్యనారాయణ అన్నారు. సోమవారం డిమాండ్స్ డే సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పిలుపుమేరకు తహసిల్దార్ కార్యాలయము వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నూరు నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ బుజ్జి మాట్లాడుతూ 32 మంది విద్యార్థి యువజన బలి దానాలతో సాధించుకున్న ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ చేసే ఆలోచనను విరమించుకోవాలన్నారు. అత్యధిక లాభాలతో ప్రత్యక్షంగాను పరోక్షంగాను సుమారు లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను కారు చౌకగా బడా పారిశ్రామికవేత్తలకు కట్ట పెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ ఉద్దేశాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీసివేయాలని,స్మార్ట్ మీటర్లను బిగించే ఆలోచనను విరమించుకోవాలని, అలానే రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం మోపే విద్యుత్ భారాలను ఉపసంహరించుకొని,విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించటం నిలిపివేయాలన్నారు. మణిపూర్లో జరుగుతున్న హింస సెలరేగి పోతుందని, విద్యా ర్థులపై సుదీర్ఘ హింస కర్ఫ్యూ,ఇంటర్నెట్ షట్ డౌన్ ప్రభావం చూపుతున్నాయన్నారు. మణిపూర్లో సుదీర్ఘ హింసాత్మక సంఘటనలతో ఈశాన్య రాష్ట్రాలలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల విద్య వృత్తిపరమైన కార్యకలాపాలను ప్రభావితం చేస్తున్నాయ న్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు లో చర్చించి హింసను పేరేపిస్తున్న గ్యాంగులను అదుపు చేసి మణిపూర్ రాష్ట్రాన్ని కాపాడాలన్నారు.విద్యుత్ ఒప్పందాలలో అదాని లంచంగా ఇచ్చిన రూ.2100 కోట్లపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి రెంటాల కుమారి, షేక్ ఆశాభి, రామిశెట్టి శ్రీనివాసరావు దర్శి లింగా రావు, గోపి, సుబ్బారావు, సిహెచ్ విజయలక్ష్మి, గంగ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆంజనేయస్వామి పూజలు



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్:**
పిడిగురాళ్ల పట్టణంలోని భానోదయ పాఠశాలలో శ్రీ ఆంజనేయ స్వామి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. పాఠశాల డైరెక్టర్ శివా రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో శ్రీ ఆంజనేయ స్వామి పూజా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో పలువురు ఆంజనేయ స్వామి మాలధారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు మొక్కారు. అలాగే ఆంజనేయ స్వామి పాటలతో భజనలు అలరిం చాయి. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆంజనేయ స్వామి మాలదారులు పాల్గొన్నారు.

# మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం : ఐద్వా

**గుంటూరు మేజర్ న్యూస్:**
నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు హింస వ్యతిరేక వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక గుజ్జనగుండ్ల లో ఐద్వా ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఐద్వా నగర కార్యదర్శి ఏ కళ్యాణి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై రోజురోజుకీ హింస పెరిగిపోతున్నాయని, హింస ని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. ప్రధానంగా మద్యం , గంజాయి అమ్మకాలు అలాగే సోషల్ మీడియాలో అశ్లీల వెబ్సైట్లను నియంత్రించడంలో ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని అన్నారు. మహిళా హక్కులు మానవ హక్కులే కాబట్టి రాజ్యాంగం ఇచ్చినటువంటి ఈ హక్కుని కాపాడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు.ఈ సందర్భంగా డిసెంబర్ 10 సాయంత్రం నాలుగు గంటల నుంచి శంకర్ విలాస్ సెంటర్లో మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టాలని సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందని దానిలో ప్రజలందరూ పాల్గొని సంతకాలు చేయాలని కోరారు. అనంతరం ఐద్వా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఆ కమిటీకి కార్య దర్శిగా షేక్ షకీల, అధ్యక్షులుగా కే.భవాని ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్మల, జుబేదా, ఆషా,అంజలి, అన్నా మేరీ, సమీరా, నగ్మా బాయి, బాజీ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి పి.నారాయణని మర్యాదపూర్వకంగా కలిసిన

### గురజాల ఎమ్మెల్యే యరపతినేని



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, అర్బన్ డెవలప్మెంట్ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ని మర్యాదపూర్వకంగా కలిసిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు. గురజాల నియోజకవర్గంలోని మున్సిపాలిటీల అభివృద్ధి నిమిత్తం డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ నందు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హౌసింగ్, అర్బన్ డెవలప్మెంట్ మంత్రివర్యులు పొంగూరు నారాయణ ని మర్యాదపూర్వకంగా కలిసి, గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, మున్సిపాలిటీలలో రోడ్స్, డ్రైన్సు, సెంట్రల్ లైటింగ్ డివైడర్స్, పార్కులు, డ్రింకింగ్ వాటర్ సప్లై, పిడుగురాళ్లలో నిర్మాణంలో ఉన్న మున్సిపల్ బిల్డింగ్ కి పెండింగ్ నిధులు, అభివృద్ధి పనులకు నిధులు విడుదల చెయ్యవలసినదిగా కోరటం జరిగింది.

## డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

### న్యాయమూర్తి:- ఎమ్.మురళి గంగాధరరావు



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** 3 రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు వారి ఆదేశాల మేరకు 14-12-2024 తారీకున రెండవ శనివారంకోర్టు ప్రాంగణంలో జాతీయాలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కమ్,సివిల్ జడ్జి, జూనియర్ డివిజన్,ఎం మురళీ గంగాధరరావు ఒక ప్రకటనలో తెలియజేసినారు. కావున పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ జాతీయ లోక్ అదాలత్ లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కుటుంబ తగాదాలు, ఫ్రీ లిటిగేషన్ కేసులు, ముందస్తు వాయిద్యములను, తదితర కేసులు మార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలియజేశారు. తద్వారా కక్షిదారులకు సమయము, ధనము ఆదా అవుతుందని తెలియజేశారు. 14-12-2024 తేదీన రెండవ శనివారం, పిడుగురాళ్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలతో జరుగును. కావున కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవలసినదిగా కోరడమైనది.

## చంపేస్తామని హెచ్చరిస్తూ..

### పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయి. చంపేస్తామని హెచ్చరిస్తూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్, అభ్యంతరకర భాషతో సందేశాలు వచ్చాయి. బెదిరింపు కాల్స్, సందేశాలు వచ్చిన విషయాన్ని అధికారులు.. పవన్ కల్యాణ్, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

**కఠిన చర్యలు తీసుకోండి: అనిత**

పవన్ కల్యాణ్ పేషీకి బెదిరింపు కాల్స్ రావడంపై హోంశాఖ మంత్రి అనిత స్పందించారు. డీజీపీతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం పేషీకి రెండుసార్లు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని డీజీపీ.. హోంమంత్రి అనితకు వివరించారు. ఫోన్ కాల్ వచ్చిన నెంబర్‌ను ట్రేస్ చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రతనిధుల పట్ల ఈ విధమైన చర్యలకు పాల్పడేవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదని అనిత స్పష్టం చేశారు.

# విజయసాయిరెడ్డికి మతి భ్రమించింది

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- సీఎం పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య. బ్యూరో**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయటంలో కుట్రకోణం దాగి ఉందేమోనన్న దాని పై పోలిసు ఉన్నత అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని,లుక్ అవుట్ నోటిసులు ఇచ్చిన కూడా నిస్సిగ్గుగా చంద్రబాబు నాయుడు పై అనుచిత వ్యాఖ్యలు చేయటం విజయ సాయి రెడ్డి కి తగదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కాకినాడ పోర్టును జగన్ రెడ్డి, విజయ సాయి రెడ్డి బెదిరించి రాయించేసుకున్న వ్యవహారాన్ని పక్కదారి పట్టించేందుకే మైండ్ గేమ్ ఆడుతున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విమర్శించారు. చంద్రబాబుపై



ఇష్టమొచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. వైసీపీ అధికారంలోకి వచ్చేసరికి చంద్రబాబు బతికి ఉంటే.. ఆయన్ను జైల్లో వేస్తాం అంటూ మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి చంచల్ గూడ ఏ-2 ఖైదీనన్న విషయం మరిచిపోతే ఎలా అని గళ్ళా మాధవి ఎద్దేవా చేశారు. వివేకానంద రెడ్డి హత్య చేయబడితే మొదటగా దానిని గుండెపోటు అని చెప్పిన విజయసాయిరెడ్డిని కూడా ముద్దాయిగా చేర్చాలన్నారు. ఇప్పటికే కొడాలి నాని,అంబటి, రోజా లాంటి వారి వలన తమ పార్టీ కూలిపోయి 11 సీట్లకు పరిమితం అయ్యిందని, మరలా వైసిపి నామరూపాలు లేకుండా పోవటానికి ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అంటూ వైసిపి క్యాడరే విజయసాయిరెడ్డిని ఛీ కొడుతున్నారంటూ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.వైసిపి హయంలో తయారయిన నకిలీ మద్యం విషయం కూడా తెరమీదకు రాబోతున్నదని మరలా జైలుకు వెళ్ళటానికి విజయ సాయిరెడ్డి,అతని అల్లుడు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు.

## పల్నాడు జిల్లా వ్యాప్తంగా స్కిల్ హబ్‌లు ఏర్పాటుకు కృషి





**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ది సంస్థ(ఏ.పి.ఎస్.ఎస్.డి.సి) వారి ఆధ్వర్యములో రాష్ట్రంలో ఉన్న ప్రతి నియోజకవర్గములో ఒక స్కిల్ హబ్ ను ఏర్పాటుచేసి వాటి ద్వారా నిరుద్యోగ యువతి యువకులకు ఉచిత శిక్షణ మరియు ఉపాధి కల్పించపడుతుంది. అదేవిధంగా పల్నాడు జిల్లా పరిధిలో ప్రతి నియోజకవర్గములో ఒక స్కిల్ హబ్ ను ఏర్పాటు చేయడం జరిగింది, ఈ స్కిల్ హబ్ లో నిర్వహిస్తున్నటువంటి కోర్సు లకు సంబందించిన గోడ పత్రికను ఈ రోజు పల్నాడు జిల్లా కలెక్టర్ శపి. అరుణ్ బాబు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు ఆవిష్కరించడం జరిగింది, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలోని నిరోద్యోగ యువతీ యువకులకు ఈ అవకాశం సద్వినియోగ పర్చుకోవాలని, జిల్లాలో ఉన్నటువంటి వనరులు మరియు పరిశ్రమలలో ఉన్నటువంటి ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకొని యువతకి డిమాండ్ ఉన్నటువంటి కోర్సుల్లో రెండు నెలల పాటు నైపుణ్య శిక్షణ కల్పించి వారికి స్థానికంగా మరియు ఇతర రాష్ట్రాలలో ఉన్నటువంటి పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలియజేసారు, ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే , జిల్లా అధికారులు పాల్గొన్నారు, కావున జిల్లాలోని ఆసక్తి ఉన్నటువంటి యువతి యువకులు ఈ కోర్సెస్ కొరకు వారి విధ్యార్హతను బట్టి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

## ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలి

### పీజిఆర్ఎస్ కు వినతులు 51

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ అరుణ్‌బాబు

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ( పీజిఆర్ఎస్)కు వచ్చే ప్రతీ ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన 51 మంది అర్జీదారులు తమ వినతులను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయానే నమ్మకంతో నలుమూల ప్రాంతాల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని అన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పరిష్కారం చూపాలని ఉద్బోదించారు. ఈ కార్యక్రమంలో ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

సుదూర ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారానికి పిజిఆర్ఎస్ లో ప్రజలు అందించిన ఫిర్యాదులను నాణ్యతగా పరిష్కరించకుంటే సంబంధిత జిల్లా అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ హెచ్చరించారు. సోమవారం కలక్టరేట్ లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ, డిఆర్ఓ ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీ కుమారి , గంగరాజు , గుంటూరు ఆర్డిఓ కే.శ్రీనివాస రావు ప్రజల నుండి 172 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యతగా పరిష్కరించాలన్నారు. సక్రమంగా పరిష్కరించ కుండా అసమగ్ర సమాచారంతో



పిటిషనర్ కు వివరాలు పంపి పిటీషన్ క్లోజ్ చేస్తే సంబంధిత క్షేత్ర సిబ్బందితో పాటు జిల్లా అధికారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు ప్రతి సోమవారం సమయపాలన పాటిస్తూ పిజిఆర్ఎస్ కు హాజరు కావాలన్నారు. ముందస్తు అనుమతి తీసుకోనిదే గైర్హాజరుండ రాదన్నారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తులను జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ సమీక్షించడం జరిగింది. గత వారంలో పరిష్కరించిన పిటీషన్లను జిల్లా కలెక్టర్ గారితో పాటు సంయుక్త కలెక్టర్ కూడా ర్యాండమ్ గా పరిశీలించడం జరిగిందన్నారు. అందులో కొన్ని శాఖల అధికారులు సంక్షిప్త సమాధానంతో ముగించడం గుర్తించడం జరిగిందన్నారు. సమస్య పరిష్కరించిన విధానాన్ని సంపూర్తిగా అర్ధమయ్యే రీతిలో వివరాలు పొందు పరచాల్సి వుందన్నారు. పరిష్కరించడానికి తమ పరిధిలో లేని వాటికి సంబంధించి వివరంగా పిటిషనర్ కు తెలుపవలసి ఉందన్నారు. ఫిర్యాదుల పరిష్కారాన్ని నిర్ణీత గడువు లోపు ఎట్టి పరిస్తితుల్లోను పరిష్కరించాల్సి వుందన్నారు. కోర్టు కేసులకు సంబంధించి సమీక్షిస్తూ గౌరవ కోర్టులకు ఎప్పటికప్పుడు కౌంటర్లు దాఖలు పరచాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా కేసు కంటెమ్ట్ వరకు వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఓ శేషశ్రీ , జెడ్పి సిఇఓ జ్యోతిబసు , పీడీ హౌసింగ్ ప్రసాద్ , జిల్లా వ్యవసాయ శాఖాధికారి వెంకటేశ్వర్లు, గ్రౌండ్ వాటర్ డీడీ వందనం, డిఎస్ఓ కోమలి పద్మ , డియం అండ్ హెచ్ఓ డా. విజయలక్ష్మీ , డిపిఓ బి.వి.నాగ సాయి కుమార్ , ఎస్. ఈ పంచాయితీ రాజ్ గుర్రం బ్రహ్మయ్య , ఏ.డి మత్స్య శాఖ గాలి దేవుడు , డిసిఓ వీరాచారి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.